క్లుప్తంగా

రెండు రోజులు స్టూడెంట్ పాస్‌లు ఇవ్వలేం

చిలకలూరిపేటటౌన్: ఆర్టీసీ ప్రతినెలా విద్యార్థులకు అందించే రాయితీ బస్‌పాస్‌లు మంజూరు నిలుపుదల చేసినట్లు చిలకలూరిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో బస్‌పాస్‌లు ఆధునీకరణ ప్రక్రియలో కొన్ని సాంకేతిక సమస్యలు నెలకొన్నాయన్నారు. కావున ప్రతి నెలా క్రమం తప్పకుండా డిపో ప్రాంగణంలో ఇచ్చే స్టూడెంట్ బస్‌పాస్‌లను ఈనెల 5,6వ తేదీల్లో ఇవ్వడం సాధ్యం కావడం లేదని తెలిపారు. నియోజకవర్గంలోని నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట మండలాల్లోని ఆర్టీసీ ప్రయాణికులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అసౌకర్యాన్ని అర్థం చేసుకుని తమతో సహకరించాలని కోరారు.

నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలి



వినుకొండ(నూజెండ్ల): కేంద్ర ప్రభుత్వం పెంచిన దిగుమతి పన్ను వల్ల నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం విధించిన పన్నును వెంటనే తగ్గించాలని సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక శివయ్య స్థూపం సెంటర్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన సుంకం వల్ల కందిపప్పు, మినప్పప్పు, పామాయిల్, శనగనూనె, ఉల్లిగడ్డలు, వెల్లుల్లి, మిర్చి, చింతపండు లాంటి సరుకుల ధరలు అదుపు లేకుండా పెరిగి ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్య ప్రజలు మోపలేని భారాన్ని వేస్తున్నారని తెలిపారు. వెంటనే కేంద్రం సుంకాన్ని తగ్గించి నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాసరావు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ఈపూరు: మండలంలోని ఇనిమెళ్ల గ్రామంలో బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రగాయాలై చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతిచెందాడు. సేకరించిన వివరాల మేరకు...పిడుగురాళ్ల మండలం జానపాడుకు చెందిన పిచ్చయ్య (46) గత మూడు సంవత్సరాలుగా ఇనిమెళ్ల గ్రామంలో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యా యి. చికిత్స నిమిత్తం నరసరావుపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ప్రమాదంపై ఈపూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో స్టీరింగ్ విరిగి.. రిటైర్డ్ సీఐకు గాయాలు



శావల్యాపురం: మండలంలో ఆటో కారును ఢీకొన్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వినుకొండ నుంచి విజయవాడకు కారులో తన స్నేహితుడితో కలసి విశ్రాంత సీఐ తాటికొట్టి సాంబశివరావు బయలుదేరారు. మార్గమధ్యంలో మండల కేంద్రంలోని పెట్రోలు బంకు వద్ద సత్తెనపల్లి మండలం ఫణిదం నుంచి ఈపూరు మండలం కొచ్చెర్లకు వెళ్తున్న ఆటో ఢీకొంది. ఆటో స్టీరింగ్ ఊడిపోవడమే ఈ ప్రమాదానికి కారణమైంది. కారులో ప్రయాణిస్తున్న విశ్రాంత సీఐకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే పొలం పనులు చేస్తున్న మాజీ సర్పంచ్ చెరుకూరి ప్రసాద్ క్షతగాత్రులను బయటకు తీసి స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు అద్దాలు పగలిపోయాయి. విషయాన్ని విశ్రాంత సీఐ స్థానిక ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావుకు సెల్‌ఫోను ద్వారా సమాచారం అందించారు.

7 నుంచి ఉచిత యోగ శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుంచి 180వ ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగ గురువు కూనిశెట్టి వెంకట జనార్దన్ గురువారం తెలిపారు. శ్రీపట్టాభిరామ స్వామి ఆలయంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు 28 రోజుల పాటు శిబిరం కొనసాగుతుందని వివరించారు. శిబిరంలో 42 యోగ ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం, సూర్య నమస్కారాలు, ఆహార నియమాలు బోధిస్తామన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఉపయోగపడుతుందని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలని సూచించారు.

రొంపిచర్లలో 10.5 మి.మీ వర్షపాతం

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో గురువారం ఉదయానికి 10.5 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. తీవ్రంగా కాస్తున్న ఎండలకు ఈ వర్షాలు మండల ప్రజలకు ఉపశమనాన్ని ఇచ్చాయి. అలాగే వినుకొండలో 15.7 ఎం.ఎం., రెంటచింతలో 8.4, చిలకలూరిపేటలో 13.8, శావల్యాపురంలో 15.3, పిడుగురాళ్లలో 11.1, నరసరావుపేటలో 10.0, పెదకూరపాడులో 10.6 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది.

పాపం.. జన సైనికులు

- కూటమిలో జనసైనికులకు అవమానం
- కనీసం కార్యాలయాల్లో పట్టించుకోని అధికారులు
- తహసీల్దార్ కార్యాలయంలో పవన్ ఫొటోకు స్థానం లేదు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జన సైనికులు
- సీఎం చంద్రబాబు ఫొటోకు దక్కని గౌరవం



తహసీల్దార్ కార్యాలయంలో వేస్ట్ కాగితాలు పడవేసే టబ్‌లో దర్శనమిస్తున్న సీఎం ఫొటో

నరసరావుపేటటౌన్: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నిరకాల జిమ్మిక్కులు చేయాలో అన్నీ చేసింది. ప్రజలకు అలవిగాని హామీలిచ్చి అందలమెక్కింది. అధికారం వస్తుందో లేదోననే భయంతో పవన్ కల్యాణ్‌తో రాయబేరం కుదుర్చుకుంది. క్షేత్ర స్థాయిలో తెలుగుదేశం పార్టీతో కలవడానికి జనసేన నాయకులకు ఇష్టం లేకపోయినప్పటికీ అప్పటి పరిస్థితులకు తగ్గట్లుగా తలొంచారు. తీరా అధికారంలోకి వచ్చాక మాత్రం ప్రభుత్వ కార్యాలయాల వద్దగానీ, ఉన్నతాధికారుల వద్దగానీ జనసేన నాయకులకు కనీస మర్యాద దక్కడం లేదు. నరసరావుపేటలో మూడు నెలల కాలంలోనే తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య సయోధ్య కుదరక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ఎదుటే బాహాబాహీకి దిగారు. ఇదే సమయంలో అటు జనసేన పార్టీ నాయకులకు, తెలుగుదేశం పార్టీ కేడర్‌కు మధ్య అంతర్గత విభేదాలు తలెత్తాయి. నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల్లో ఎక్కడా ఎమ్మెల్యేతో కలిసి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని పాల్గొనటం లేదు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అధికారంలో ఉండడంతో జనసేన నాయకులను పట్టించుకోవడం లేదని తెలుస్తోంది.

తహసీల్దార్ కార్యాలయంలో పవన్ ఫొటో లేదు!

నరసరావుపేట తహసీల్దార్‌గా వేణుగోపాల్ రావు ఉన్నారు. ఆయనను నిబంధనలకు విరుద్ధంగా తెలుగుదేశం పార్టీ నాయకులు ఇక్కడకు తెప్పించుకున్నారు. తహసీల్దార్లకు సొంత నియోజకవర్గాల్లో పోస్టింగ్ ఇవ్వకూడదనే నిబంధన ఉన్నప్పటికీ నరసరావుపేట మండలం రావిపాడుకు చెందిన వేణుగోపాల్‌రావు నరసరావుపేటకు డిప్యూటేషన్‌పై వచ్చారు. ఆయన వచ్చిన దగ్గర నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు చెప్పినట్లు మాత్రమే నడుచుకుంటూ జనసేన నాయకులను అసలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. దీనికి ఆజ్యం పోస్తూ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటో పెట్టలేదు. దీనిపై జన సైనికులు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వ సూచికగా పీఎం నరేంద్ర మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఫొటోలను అన్ని కార్యాలయాల్లో పెట్టాలని ప్రభుత్వం జీవో ఇచ్చినా తహసీల్దార్ పట్టించుకో లేదు. దీంతో జన సైనికులు తమ పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలో అర్థంగాక మౌనం వహిస్తున్నారు.

ఫొటో పెట్టేది ఇలాగేనా?

ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో తహసీల్దార్ కార్యాలయంలో చెత్తబుట్ట లాంటి టబ్‌లో దర్శనమిస్తోంది. దీంతో అధికారుల తీరుపై తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలు సేవల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారులు చంద్రబాబు ఫొటో అక్కడ ఉండటాన్ని గమనించి ముఖ్యమంత్రికి ఇచ్చే మర్యాద ఇంతేనా అనుకుంటూ ముందుకు సాగుతున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా

తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటో పెట్టకపోవటంపై పల్నాడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని తెలిపారు.
ప్రభుత్వం జీవో ఇచ్చినప్పటికీ అధికారులు అమలు చేయకపోవటం దారుణమన్నారు. ఉప ముఖ్యమంత్రికి జరిగిన అవమానంగా భావించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వ్యాధుల నివారణకు ప్రజాభాగస్వామ్యం కావాలి

- వైద్యఆరోగ్యశాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ సుబ్రమణ్యేశ్వరి
- వ్యాధులపై అధికారులతో సమీక్ష



అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశమైన డాక్టర్ సుబ్రమణ్యేశ్వరి

నరసరావుపేట: జిల్లాలో పెరిగిపోతున్న డెంగీ, చికున్‌గున్యా లాంటి వ్యాధులు తగ్గాలంటే ప్రజల భాగస్వామ్యం చాలా అవసరమని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అదనపు డైరక్టర్ డాక్టర్ సుబ్రమణ్యేశ్వరి పేర్కొన్నారు. గురువారం తమ కార్యాలయ చీఫ్ ల్యాబ్ టెక్నీషియన్లు శుభద్ర, కల్యాణితో కలిసి జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్ సమావేశమయ్యారు. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా వ్యాధులపై సమీక్ష చేశారు. జిల్లాలో గతేడాది కంటే ఈఏడాది డెంగ్యూ కేసులు పెరికేందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధుల నివారణకు ప్రజలు తమ ఇళ్లు, ఇళ్ల పరిసరాల్లోని నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. దోమలు ఒకేసారి 100 నుంచి 150 గుడ్లు పెట్టి వారం రోజుల వ్యవధిలో దోమలుగా మారు తాయని, అందువలన నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత పాటిస్తూ నీరు కాచి చల్లార్చిన తాగితే డయేరియా, టైఫాయిడ్, కామెర్లు రాకుండా ఉంటాయన్నారు. ఆహారం వేడిగా ఉండగానే తినాలని, బజార్ల బండ్లపై దొరికే వాటిని తినటం వలన ఫుడ్‌పాయిజనయ్యే అవకాశం అధికంగా ఉంటుంద న్నా రు. మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ డెంగీ, మలేరియా వ్యాధుల నియంత్రణకు కాలువల్లో మందు చల్లుతూ ఇళ్ల పరిసరాల్లోని నీటి నిల్వలు ఉండకుండా చేయటం, ఫీవర్ సర్వే, ఫాగింగ్ చేసి జ్వరపీడితులు పెరగకుండా చేయాలని కోరారు. ఏఎంవో చుక్కా వెంకటేశ్వర్లు, అన్నీ సబ్‌యూనిట్ల అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

రైతులను ముంచిన నకిలీ విత్తనాలు



నాదెండ్ల: నకిలీ విత్తనాల కారణంగా ఓ రైతు మోసపోయిన సంఘటన చందవరం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. జి.శ్రీనివాసరెడ్డి ప్రతి ఏటా స్వీట్‌కార్న్ సాగు చేస్తుంటాడు. ఈ ఏడాది 1.75 ఎకరాల్లో సాగు చేశాడు. విత్తనాలను గుంటూరు రాజాగారితోటలోని ఓ దుకాణంలో మిధాస్ కంపెనీ విత్తనాలు కొనుగోలు చేసిన సాగుచేశాడు. 70 రోజులు గడిచినా కండె సైజు రాకపోవటం, కొన్ని కండెలు విత్తనాలు లేకుండా పల్చగా ఉండటం గమనించాడు. తాను 1.75 ఎకరాల్లో పంట సాగుకు రూ.2 లక్షలు ఖర్చు చేశానని, నకిలీ విత్తనాల కారణంగా మోసపోయానని వాపోతున్నాడు. వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

జెట్టిపాలెం(రెంటచింతల): విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీసేందుకే జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య చెప్పారు. గురువారం జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల పోటీలకు ఎంపికైన పి.హారిక, కె.బాల గౌతమ్, జి.జ్యోతిలకు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఈనెల 1న నిర్వహించిన మండలస్థాయి చెకుముకి సైన్స్ పోటీలలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 11 టీంలు పాల్గొనగా జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి ఈనెల 16 నుంచి నిర్వహించే జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకే గర్వకారణమన్నారు. విద్యార్థులలో పోటీతత్వం ఉన్నప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న విద్యార్థులను ఉపాధ్యాయులు జి. విద్యాసాగర్, కె.కుమార్, టి.అలేఖ్య, ఎస్‌కే జబీనా, విద్యార్థులు అభినందించారు.

విఠంరాజుపల్లిలో ఉపాధి హామీ గ్రామసభ



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలంలోని విఠంరాజుపల్లిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ బూసిరెడ్డి పాల్గొని ఉపాధి హామీ పనుల గుర్తింపు, ప్రణాళిక అమలు తదితర అంశాల గురించి వివరించారు. గ్రామంలో అవసరమయ్యే పనులను గుర్తించి వాటిని ఆమోదం చేయాలని సూచించారు. ప్రతిఒక్కరికి ఉపాధి పనులను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సుందర్‌రామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు, మేట్స్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్ హోల్ కాదు.. డెత్‌హోల్!!



ఆర్టీసీ బస్టాండ్ వెనుకవైపు ప్రకాష్ నగర్‌లోని రెండో వీధిలో చప్టా మ్యాన్ హోల్‌పై ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్ మాయమైంది. దీంతో ఆ మార్గంలో వాహనాలపై రాకపోకలు సాగించే ప్రయాణీకులు ప్రమాదకరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. గత ఐదారు నెలల క్రితం ఈ రోడ్డులో డ్రెయినేజ్ కాలువపై పాడైన పాత చప్టా స్థానంలో నూతన చప్టా నిర్మించి డెయినేజ్‌లో పూడికను సులభంగా తీసేందుకు మధ్యలో మ్యాన్‌హోల్ ఏర్పాటు చేశారు. ఏదైనా చెత్తాచెదారం అడ్డుపడి మురుగునీరు ఆగిన సమయంలో తొలగించి శుభ్రం చేసేందుకు చప్టాపైనున్న గ్రిల్‌కు ఏర్పాటు చేశారు. అయితే ఆ గ్రిల్‌ను కొందరు పాత ఇనుప సామాన్లకు విక్రయించుకునేందుకు చోరీ చేయటంతో గొయ్యి ఏర్పడింది. సుమారు నాలుగైదు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. రాత్రి సమయంలో ప్రయాణించే వారి వాహనాలు ఆ గోతిలో పడి ప్రమాదానికి గురై గాయాలు పాలయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. యంత్రాంగం దీనిపై స్పందించాల్సి అవసరం ఉంది.

– నరసరావుపేట

చెట్టుని కూల్చిన గాలి!



మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో వర్షం కురిసింది. గాలులకు వడ్లమూడి వారిపాలెం, విప్పర్లపల్లి గ్రామాల మధ్య ఆర్ అండ్ బీ రోడ్డులో చెట్లు పడిపోయాయి. దీనివల్ల ఆ రహదారిలో తిరిగే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ద్విచక్ర వాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈదురు గాలులకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

–రొంపిచర్ల

ఆరంభమైన శరన్నవరాత్రులు



శావల్యాపురంలో బాలా త్రిపురసుందరిగా అమ్మవారు



నరసరావుపేట పాతూరు శివాలయంలో..



రొంపిచర్లలో బాలగా వాసవీ అమ్మవారు



గణపవరం బాలత్రిపురదేవి అలంకారంలో అమ్మవారు



లింగారావుపాలెంలో బాలత్రిపురసుందరిగా..



బోయపాలెంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విరమించుకోవాలి



రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న రాము

నరసరావుపేట ఈస్ట్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గాంధీపార్క్ వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో గురువారం రైతు సంఘం ప్రతినిధులు దీక్షలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రాము మాట్లాడుతూ, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేసి సాధించుకొన్న ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయటం తగదని తెలిపారు. ఉక్కు పరిశ్రమకు సొంతంగా గనులను కేటాయించి పరిశ్రమ పురోగమించేందుకు కేంద్రం సహరించాలని కోరారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగ పరిశ్రమలను అప్పగించటం విరమించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబు రావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, ఉప్పలపాటి రంగయ్య, వెంకటరత్నం, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి



మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరావు

నాదెండ్ల: గణపవరం గ్రామాన్ని నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు గురువారం సందర్శించారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ కార్యక్రమంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో గ్రామపెద్దలు, స్థానికులతో మాట్లాడారు. గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా గ్రామపెద్దలు చొరవ తీసుకోవాలన్నారు. చిన్న చిన్న వివాదాలను ఎప్పటికప్పుడు పరిష్కరించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని కోరారు. పోలీసులు ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తారని, అవసరమైన సమయాల్లో గ్రామ సమస్యలపై పోలీసులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై పుల్లారావు, గ్రామ నాయకులు కెల్లంపల్లి అచ్చయ్య, కంచర్ల శ్రీనివాసరావు, కాట్రు రోశయ్య, శేషయ్య, గాలి బుచ్చయ్య, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలకు అందరూ సహకరించాలి



స్వచ్ఛతా హి సేవ ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్

నరసరావుపేట రూరల్: పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే గ్రామంలోని వారు ఆరోగ్యవంతులుగా ఉంటారని డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్ తెలిపారు. మండలంలోని లింగంగుంట్ల ఎస్సీ కాలనీలో గురువారం నిర్వహించిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో బాలునాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్య సిబ్బందిని సత్కరించారు. కాలనీలోని రోడ్ల వెంట ఉన్న వ్యర్థాలను తొలగించారు. పరిశుభ్రతపై జరిగిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ పల్నాడుగా మన జిల్లాను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలనికోరారు. చెత్తను, వ్యర్థాలను రోడ్ల వెంట వేయకుండా పారిశుద్య సిబ్బందికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కెవి ప్రసాద్, ఏపీఎం భరత్, గంగుల పెద్దిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎక్సైజ్ అధికారులు

ఈపూరు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై ఈపూరుకు వచ్చారు. అలాగే సబ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసరావు పెదకూరపాడు నుంచి బదిలీపై ఈపూరు వచ్చారు. ఇక్కడ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రేవతి బదిలీపై కందుకూరు వెళ్లారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు తూ.చ తప్పకుండా పాటిస్తామని, అక్రమ మద్యంపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఉపాధి సభలు ఉపయోగకరంగా ఉండాలి

శావల్యాపురం: ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో ప్రజలకు ఉపయోగకరమైన పనులను గుర్తించాలని ఏపీవో కె.రామారావు అన్నారు. గురువారం మండలంలోని శావల్యాపురం, కనమర్లపూడి, బొందిలిపాలెం, మతుకుమల్లి గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల్లో ఉపాధి గ్రామ సభలు ప్రజాప్రతినిధులు అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈసందర్భంగా శావల్యాపురంలో జరిగిన గ్రామసభలో ఏపీవో కె.రామారావు పాల్గొని మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో పంట కాల్వల్లో పూడికతీత పనులు, పొలాలకు వెళ్ల రహదారి పనులు,ఉద్యాన పంటలు సాగుకు రైతులు ఆసక్తి చూపటానికి ప్రజల్లో చైతన్యం పెంపొందించేలా ఉపాధి సిబ్బంది కీలకపాత్ర బాధ్యత వహించాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు రైతులకు అవసరమైన పనులను గుర్తించి పంచాయతీ తీర్మానం చేయంచాలన్నారు. సర్పంచులు యాగసిరి చెన్నమ్మ, చింతా విజయ్‌కుమార్, అంకారావు, యలగాల బసవయ్య, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

ఏకపక్ష పోలీసులపై చర్యలు తీసుకోవాలి

నరసరావుపేటటౌన్: బార్ అండ్ రెస్టారెంట్‌లో చోటుచేసుకున్న ఘర్షణపై ఏకపక్ష వైఖరి అవలంభిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఎన్‌జీవోహోంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రెండు రోజుల క్రితం జీవన జ్యోతి బార్ అండ్ రెస్టారెంట్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది అన్నారు. దీంతో ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారన్నారు. అయితే కేవలం బార్ యజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మాత్రమే కేసు నమోదు చేశారన్నారు. బార్ యజమాని కుమారుడు జనసేన నాయకుడు కావటంతో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఎదుటి వర్గం ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించలేదన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి సికినం చిన్నా తదితరులు పాల్గొన్నారు.